మహా ముస్తాబు

— మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు కీసరగుట్ట సిద్ధం —


ఉత్సవ మూర్తులు



- నేటి నుంచి ఈ నెల 21వ తేదీ వరకు శ్రీభవానీ రామలింగేశ్వర స్వామి ఆలయ జాతర
- ఆరు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు ముస్తాబైన శైవక్షేత్రం
- యాత్రికులు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ చర్యలు

కీసర: ప్రసిద్ధ శైవక్షేత్రమైన కీసరగుట్టలోని శ్రీభవానీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు నేటి(గురువారం) నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో నేటి నుంచి ఈ నెల 21 తేదీ వరకు ఆరు రోజుల పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నారు. టీటీడీ వేద పాఠశాల ఆచార్య పుల్లేటీకుర్తి గణపతిశర్మ ప్రధాన సంధాన కర్తగా వైదిక కార్యక్రమాలు జరుగుతాయి. ఉదయం 11 గంటలకు ఆలయ చైర్మన్ తటాకం రమేష్‌శర్మ దంపతులచే విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనము, రుత్వీక్‌పరణము, యాగశాల ప్రవేశము, అఖండ జ్యోతి ప్రతిష్ఠాపనము తదితర కార్యక్రమాలను నిర్వహిస్తారు. అదేవిధంగా సాయంత్రం 4 గంటలకు అగ్ని ప్రతిష్ఠాపన, బేరిపూజ, ధ్వజారోహణ, ద్వాత్రింశతి రాగాలాపన, హారతి, రాత్రి 7 గంటలకు త్రపుష్పం, పరాకస్తవం, తీర్థప్రసాద వినియోగము, 8 గంటలకు శ్రీస్వామివారిని కీసరగుట్ట నుంచి కీసర గ్రామం వరకు ఊరేగింపుగా తీసుకువస్తారు.


ఆలయంలో కొలుదీరిన శ్రీ భవానీ రామలింగేశ్వడు

5 లక్షల మంది వస్తారని అంచనా...

కీసరగుట్ట జాతరకు 5 లక్షల మంది వరకు యాత్రికులు వస్తారని అధికారులు, ఆలయ సిబ్బంది అంచనా వేస్తున్నారు. ఈ మేరకు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. కలెక్టర్ అమయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వివిధ కమిటీల అధికారులు వారి వారి పనులను ముమ్మరంగా పూర్తి చేశారు. నేటి నుంచి పోలీసులు, పారిశుద్ధ్య సిబ్బంది, ఆర్‌డబ్ల్యూఎస్, వైద్య, విద్యుత్ తదితర విభాగాల అధికారులంతా జాతర విధుల్లో నిమగ్నమయ్యారు.

బ్రహ్మోత్సవాల్లో భాగంగా రోజూ వారీగా కార్యక్రమాలు ఇలా...

మొదటిరోజు: 16వ తేదీ గురువారం(నేడు) ఉదయం 11 గంటలకు విఘ్నేశ్వరపూజతో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేస్తారు. అనంతరం పుణ్యాహవాచనం, రుత్విక్‌వరణం, యాగశాల ప్రవేశం, అఖండజ్యోతి ప్రతిష్ఠాపనం, అగ్నిప్రతిష్ఠాపన, బేరీపూజ, ధ్వజారోహణ, ద్వాత్రింశతి రాగాలాపన, మంత్ర పుష్పం, రాత్రి 8 గంటలకు స్వామివారు కీసరగుట్ట నుంచి కీసర గ్రామానికి విచ్చేస్తారు.

రెండో రోజు: 17 తేదీ శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి రుద్రస్వాహాకార హోమం, సాయంత్రం 4 గంటల నుంచి బిల్వార్చన, రాత్రి 7 గంటలకు ప్రదోష కాల పూజ, హారతి, మంత్రపుష్పం, పరాకస్తవం, రాత్రి 8 గంటల నుంచి స్వామివారు కీసర గ్రామం నుంచి కీసరగుట్టకు విచ్చేస్తారు. రాత్రి 9.30 గంటలకు ఉత్తరాషాఢ నక్షత్రయుక్త కన్యాలగ్న మందు శ్రీభవానీ శివదుర్గా సమేత రామలింగేశ్వర స్వామి వార్ల కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు.

మూడో రోజు: 18వ తేదీ శనివారం మహాశివరాత్రి పర్వదినం రోజు తెల్లవారుజామున 4 గంటల నుంచి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, కల్యాణ మండపంలో సామూహిక అభిషేకాలు, రుద్రస్వాహాకార హోమం, రాత్రి 8 గంటలకు నందివాహన సేవ, భజనలు, రాత్రి 12 గంటల నుంచి లింగోద్భవ కాలంలో శ్రీరామలింగేశ్వరుడికి సంతతదారాభిషేకం జరుగును.

నాలుగో రోజు: 19 తేదీ ఆదివారం ఉదయం 5.30 గంటల నుంచి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, కల్యాణ మండపంలో సాముహిక అభిషేకాలు, ఉదయం 8 గంటలకు స్వామికి అన్నాభిషేకం, రుద్రస్వాహాకార హోమం, రాత్రి 7 గంటల నుంచి ప్రదోశ కాల పూజ, మంత్రపుష్పం, రాత్రి 7 గంటలకు స్వామివారి విమాన రథోత్సవం ఉంటుంది.

ఐదో రోజు: 20వ తేదీ సోమవారం 5.30 గంటలకు మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, సాముహిక అభిషేకాలు, రాత్రి 8 గంటలకు వసంతోత్సవం, పుష్పయాగం జరుగుతుంది.

ఆరో రోజు: 21 తేదీ మంగళవారం మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, సాముహిక అభిషేకాలు, ఉదయం 10 గంటలకు క్షేత్ర దిగ్బలి అనంతరం పూర్ణాహుతితో ఉత్సవాలు ఉత్సవ సమాప్తి పండిత సన్మానంతో ఉత్సవాలు ముగుస్తాయి.

“ భక్తులకు ఎలాంటి లోటు రాకుండా చర్యలు



బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని స్వామి దర్శనం కోసం కీసరగుట్టకు వచ్చే యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకుంటాం. జిల్లా అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధుల సహకారంతో ఉత్సవాలను విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నాం. క్యూలైన్లలో ఉండే భక్తులకు వీలైనంత త్వరలో స్వామివారి దర్శనం కల్పించే విషయమై ప్రధానంగా దృష్టి పెట్టాం. ఇక ఇప్పటికే 50 వేల లడ్డూ ప్రసాదాలను సిద్ధంగా ఉంచాం. భక్తుల రద్దీ దృష్ట్యా అవసరమైతే ప్రసాదాల తయారీని పెంచుతాం.

– తటాకం రమేష్‌శర్మ, ఆలయ చైర్మన్


సిద్ధమైన క్యూలైన్లు

నేడు జిల్లా స్థాయి క్రీడోత్సవాలు ప్రారంభం.

కీసరగ్టుట బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ప్రతి ఏడాది నిర్వహించే జిల్లా స్థాయి క్రీడోత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి.
జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య, వివిధ విభాగాల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులచే కలిసి కలెక్టర్ అమయ్‌కుమార్ క్రీడోత్సవాలను ప్రారంభిస్తారు.


సిద్ధంగా ఉన్న లడ్డూ ప్రసాదం

సమాచారం

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

కీసర: ఆర్టీసీ కాలనీ ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా కీసర సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ అనిల్‌కుమార్ తెలిపారు. ఇందులో భాగంగా టీపీఎస్ కృష్ణానగర్ ఫేజ్–1, 2, 3, ప్రజాయ్ గార్డెన్ ఫేజ్–1,2, కేఎస్‌ఆర్ టౌన్‌షిప్, అరుంధతి వెంచర్, ప్రగతి నగర్ కాలనీలో ఉదయం 10 నుంచి సా.5 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ తెలిపారు.

మేడ్చల్ సబ్‌స్టేషన్ పరిధిలో...

మేడ్చల్: మేడ్చల్ 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో చెట్ల నరికివేత కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ శశిధర్‌రెడ్డి తెలిపారు. కండ్లకోయ ప్రాంతంలోని సీఎంఆర్ కళాశాలలకు, కావేరీ సీడ్స్ ఫీడర్‌కు ఉ.10 నుంచి సా.5 గంటల వరకు కరెంటు సరఫరా ఉండదని ఆయన తెలిపారు.

గౌడవెళ్లి సబ్ స్టేషన్ పరిధిలో...

గౌడవెళ్లి గ్రామంలో బుధవారం ఉదయం 10 నుంచి సాయత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ పవన్‌చందు తెలిపారు.

కీసరగుట్ట బ్రహ్మోత్సవాల క్రీడలకు 194 టీమ్‌లు

కీసర: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కీసరగుట్ట శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించనున్న క్రీడా పోటీలకు 194 టీమ్‌లు పాల్గొననున్నాయని డీఈఓ విజయకుమారి తెలిపారు. గుట్టలో ఈ నెల 16, 17వ తేదీల్లో వాలీబాల్, ఖోఖో, కబడ్డీ విభాగంలో క్రీడలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఖోఖోకు సంబంధించి బాలుర విభాగంలో 42 టీమ్‌లు, బాలిక విభాగంలో 29, కబడ్డీ విభాగంలో బాలుర విభాగంలో 41, బాలికల విభాగంలో 27, వాలీబాల్‌కు సంబంధించి బాలుర విభాగంలో 25, బాలికల విభాగంలో 20 టీమ్‌లు పోటీల్లో తలపడనున్నట్లు తెలిపారు. కాగా గురువారం 10 గంటలకు కీసరగుట్ట ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో పోటీలు ప్రారంభంకానున్నాయి.

బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరించిన ఇన్‌స్పెక్టర్ సీతారామ్

జవహర్‌నగర్: జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా సీతారామ్ బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన చంద్రశేఖర్ రాచకొండ కౌంటర్ ఇంటలిజెన్స్‌కు బదిలీ అయ్యారు. సీతారామ్ ఇంతకు ముందు సరూర్‌నగర్‌లో పనిచేశారు.


క్లుప్తంగా...

మంత్రికి ఆహ్వానం


మంత్రి మల్లారెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న దృశ్యం

కీసర: కీసరగుట్ట బ్రహ్మోత్సవాల సందర్భంగా కీసరగుట్టలో యాత్రికుల సౌకర్యార్థం వంశరాజ్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు రావాలంటూ మంత్రి మల్లారెడ్డిని బుధవారం ఆ సంఘం నేతలు ఆహ్వానించారు. కార్యక్రమంలో అన్నదాన సత్రం నిర్వహణ కమిటీ చైర్మన్ సీహెచ్ వంశరాజ్ మల్లేష్, క్రిష్టయ్య వంశరాజ్, జెడ్పీ వైస్ చైర్మన్ బెస్త వెంకటేష్, జవహర్‌నగర్ మేయర్ కావ్య తదితరులు ఉన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం


సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ జ్యోతి

శామీర్‌పేట్: గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తానని కేశవరం సర్పంచ్ జ్యోతి బలరాం అన్నారు. బుధవారం గ్రామంలో సీసీ రోడ్డు పనులను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి ఎస్‌బీఐ చేయూత


ట్యాబ్‌ను అందజేస్తున్న ఎస్‌బీఐ ఆర్ఎం ధర్మేంద్ర చౌహాన్

మేడ్చల్: మండలంలోని డబిల్‌పూర్–2 అంగన్‌వాడీ కేంద్రం అభివృద్ధికి ఆ గ్రామంలో ఎస్‌బీఐ బ్యాంకు వారు రూ.1.10 లక్షల విలువ గల వసతులు కల్పించారు. ఈ మేరకు అంగన్‌వాడీ కేంద్రంలో భవనం రంగులు వేయుటకు నగదును, టీవీ, ట్యాబ్‌లను అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ ధర్మేంద్ర చౌహాన్, ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి, సర్పంచ్ గీతా భాగ్యారెడ్డి, బ్యాంక్ మేనేజర్ దీప్తి, ఫీల్డ్ ఆఫీసర్ రాజేష్ తదితరులు ఉన్నారు.

ప్రజల కోసం నిస్వార్థంగా పని చేసిన మహనీయుడు ధర్మభిక్షం


జవహర్‌నగర్‌లో సీపీఐ ధర్మభిక్షం జయంతి వేడుకలో...


ధర్మభిక్షం చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సీపీఐ నేతలు

జవహర్‌నగర్: ఆర్థిక, సామాజిక పోరాటాలు జమిలిగా జరిగినప్పుడే పేదలకు, శ్రమజీవులకు, అట్టడుగు వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని చెప్పి ప్రజల కోసం నిస్వార్థంగా పని చేసిన మహనీయుడు ధర్మభిక్షం అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్.బాలమల్లేష్ అన్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్ సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం కామ్రేడ్ బొమ్మగాని ధర్మభిక్షం జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో తోటపల్లి శంకర్, దర్శనం యాదగిరి, వి.స్వరూప, ఎల్లయ్య, మల్లిక, అశోక్, నాగేష్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

శామీర్‌పేటలో...

శామీర్‌పేట్: మండల కేంద్రమైన శామీర్‌పేటలో బుధవరం సీపీఐ జిల్లా కార్యదర్శి సాయిలుగౌడ్ ఆధ్వర్యంలో దివంగత మాజీ ఎంపీ బొమ్మగాని ధర్మభిక్షం జయంతి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు నాగయ్యయాదవ్, యాదగిరిగౌడ్, బాలరాజ్‌గౌడ్, రాములుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇక అభివృద్ధి ఆగదు: మేయర్ కావ్య

జవహర్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం జవహర్‌నగర్‌కు రూ.25 కోట్లు మంజూరు చేసిందని, ఇక జవహర్‌నగర్ అభివృద్ధి ఆగదని మేయర్ మేకల కావ్య అన్నారు. ఈ మేరకు నిధులు మంజూరు చేస్తూ బుధవారం తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందుతుందని, జవహర్‌నగర్ అభివృద్ధికి మంత్రి మల్లారెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్‌కు విన్నవించామని, వెంటనే ప్రభుత్వం నుంచి రూ.25 కోట్లు మంజూరు చేయడం ఎంతో సంతోషకరమన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



మేడ్చల్‌రూరల్: మేడ్చల్ పెద్ద చెరువులో బుధవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఎస్ఐ రఘురాం వివరాల ప్రకారం... మేడ్చల్ పట్టణంలోని పెద్ద చెరువులో బుధవారం వ్యక్తి మృతదేహం నీటిపై తేలడం గమనించిన స్థానికులు మేడ్చల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఘటన స్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని వెలికితీశారు. కాగా మృతుడు మంగళవారం చెరువు వద్ద కనిపించాడని స్థానికులు పోలీసులకు వివరించారు. చెరువు వద్ద మృతుడి చెప్పులు, దుస్తులు ఉండడంతో ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి వివరాల తెలియకపోవడంతో గుర్తుతెలియని మృతదేహంగా కేసు నమోదు చేసుకుని గాంధీ మార్చురీకి తరలించారు.

అష్టోత్తర శత లింగాల ప్రతిష్ఠ ప్రారంభం

మేడ్చల్: మండలంలోని గౌడవెళ్లి గ్రామంలోని గుడిబండ ఆలయంలో చేపట్టిన అష్టోత్తర శత లింగాల ప్రతిష్ఠ కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. గుడిబండ శివాలయంలో ద్వాదశ జ్యోతిర్లింగ అష్టోతర(108) శివలింగాల ప్రతిష్ఠాపనకు నిర్వాహకులు శ్రీకారం చుట్టారు. ఆలయ ఆవరణలో 108 శివలింగాలను ప్రతిష్ఠిస్తున్నారు. బుధవారం ఆలయంలో గణపతి హోమం, హోమాలు, గోపూజ, శివ సహస్ర నామ పారాయణం, పలాదివాసం, పంచశయ్యాధివాసం తదితర పూజలను నిర్వహించారు. ఈ వేడుకలో మంత్రి మల్లారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో రజిత రాజమల్లారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, మాజీ సర్పంచ్‌లు జగన్‌రెడ్డి, రాజు, నాయకులు రాజ్‌గోపాల్‌రెడ్డి, పెంటమ్మ, శ్రీనివాస్‌రెడ్డి, రవిందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


గోపూజ చేస్తున్న మంత్రి మల్లారెడ్డి

'వార్డుల్లో ఎలాంటి అభివృద్ధి జరగడం లేదు'

మేడ్చల్: మున్సిపాలిటీలోని కొన్ని వార్డుల్లో మున్సిపల్ చైర్‌పర్సన్, దీపికా నర్సింహా రెడ్డి, అధికారులు ఎలాంటి అభివృద్ధి పనులు చేయడం లేదని పట్టణ కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిలర్లు నిరసన తెలిపారు. తమపై కక్షతో ప్రజలను ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. పట్టణంలో రోజురోజుకు వార్డుల్లో శానిటేషన్ సమస్య పెరిగిపోతున్నా పట్టించుకోవడం లేదని, రాజకీయాలు పక్కన పెట్టి చైర్‌పర్సన్ అన్ని వార్డులను సమానంగా అభివృద్ధి చేయాలన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రమేష్, కౌన్సిలర్లు మణికంఠ, దేవ, నర్సింహ స్వామి యాదవ్, మహిళా కౌన్సిలర్ల భర్తలు రవిందర్‌రెడ్డి, నరేందర్, రవి,సందీప్‌గౌడ్, మధుకర్‌యాదవ్, రాఘవేందర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.


మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్, కాంగ్రెస్ కౌన్సిలర్లు

నూతన్‌కల్‌లో నీటి శుద్ధి కేంద్రం ప్రారంభం

మేడ్చల్: మండలంలోని నూతన్‌కల్ గ్రామ పరిధిలోని సింజెంటా కంపెనీ ఎసీఎస్ఆర్ నిధులతో గ్రామస్థులకు శుద్ధ జలాలను అందించడానికి ప్లాంటు నిర్మాణం చేశారు. ఇట్టి ప్లాంటును గ్రామస్థులతో కలిసి గ్రామ సర్పంచ్ కవిత జీవన్ ప్రారంభించారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు రూబెన్‌క్వీన్, టెడ్డి క్రైమర్, టాయ్ అండర్సన్, విక్టోరియా బడ్లీక్, క్రిస్టియన్ ఎవెన్యూస్, డెన్నిస్ జాన్వర్ట్, రెయిమన్కో, ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి, జెడ్పీటీసీ శైలజవిజయానంద్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యురాలు రుక్సానా యూనిస్ పాషీ, పీఎసీఎస్ చైర్మన్ సురేష్‌రెడ్డి, ఉపసర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

పోచారం: ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కౌన్సిలర్ బాలగోని వెంకటేశ్ గౌడ్ అన్నారు. బుధవారం అన్నోజిగూడ రాజీవ్ గృహకల్ప కాలనీలోని డ్వాక్రా భవనంలో కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్య బృందంతో పాటు కాలనీవాసులు పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరం సందర్శన...

ఘట్‌కేసర్: మున్సిపాలిటీ 7వ వార్డులోని కంటి వెలుగు కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి శ్రీనివాస్, మున్సిపల్ చైర్ పర్సన్ పావనీయాదవ్, వైస్ చైర్మన్ మాధవరెడ్డి, కమిషనర్ వేమనరెడ్డితో కలిసి బుధవారం సందర్శించారు. వైద్యులు ఫణిందర్‌రెడ్డి, విమల, శిరీశ, విజయ, రాజేశ్వరీ పాల్గొన్నారు.

వైద్య సిబ్బందికి సత్కారం...

అవుషాపూర్‌లో పక్షం రోజులుగా కంటి వెలుగు సేవలందించిన వైద్య సిబ్బందిని బుధవారం సర్పంచ్ ఏనుగు కావేరి మశ్చేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పన్నాల కొండల్‌రెడ్డి, ఉప సర్పంచ్ ఐలయ్యయాదవ్ ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించారు. బిక్షపతిగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, మశ్చేందర్ రెడ్డి, సామ్య, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.


సీ–డీఏసీతో అనురాగ్ యూనివర్సిటీ ఒప్పందం

ఘట్‌కేసర్: వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీ (ఏయూ), ఎలక్ట్రానిక్, ఇన్ఫర్మేషన్ మంత్రిత్వ శాఖ ప్రధాన సంస్థ సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (సీ–డీఏసీ)తో బుధవారం ఒప్పందం చేసుకుంది. ఈ మేరకు సీ–డీఈసీ జాయింట్ డైరెక్టర్ జ్యోత్స్న, ఏయూ సీఈఓ నీలిమా, ఉప కులపతి రాంచంద్రం ఒప్పంద పత్రాలు అందుకున్నారు.


ఒప్పంద పత్రాలు ప్రదర్శిస్తున్న సీ–డీఏసీ, ఏయూ సిబ్బంది

విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవాలి

శామీర్‌పేట్: విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా విద్యాధికారి విజయకుమారి అన్నారు. తూముకుంట మున్సిపాలిటీలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన సాయంత్ర స్నాక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. రానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలను సాధించి ప్రభుత్వ ఆశయాన్ని నెరవేర్చాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ వసంతకుమారి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ చేస్తున్న డీఈఓ విజయకుమారి

అక్రమ నిర్మాణాలపై అధికారుల పంజా

బోడుప్పల్‌లో అక్రమంగా వెలసిన ఇళ్లు కూల్చివేత

సాక్షి ఎఫెక్ట్..

సాక్షి,మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ప్రభుత్వ, అసైన్డ్ భూముల దందాపై అధికార యంత్రాంగం సీరియస్‌గా ఉంది. బోడుప్పల్ ప్రభుత్వ భూమిలో వెలిసిన అక్రమ ఇంటిని జిల్లా అధికార యంత్రాంగం ఆదేశాల మేరకు బుధవారం కూల్చివేసిన రెవెన్యూ సిబ్బంది ఇష్టారాజ్యంగా ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్న భూ కబ్జాదారులపై కన్నెర్ర జేస్తోంది. అవసరమైతే క్రిమినల్ కేసులకు కూడా వెనకాడబోమని హెచ్చరిస్తోంది.

వీటిపైనే ప్రత్యేక దృష్టి...

జవహర్‌నగర్‌లోని సర్వే నంబర్లు 137, 377, 583, 586, 598, 647లలోని దాదాపు 30 ఎకరాల ప్రభుత్వ భూముల్లో నకిలీ లేఅవుట్లు సృష్టించి ఒక్కో ప్లాట్‌ను రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు భూకబ్జాదారులు విక్రయిస్తున్నారు. ఇందులో పలువురి కార్పొరేటర్లు, నేతల ప్రమేయం ఉంది. బోడుప్పల్ పరిధిలోని సర్వే నంబర్ 63/29లో 30 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమి ఉండగా, భూకబ్జాదారులు 60 నుంచి 80 గజాల ప్లాట్లు చేసి ఒక్కో ప్లాట్‌ను గజానికి రూ.10 వేల చొప్పున విక్రయిస్తున్నారు. ఇందులో కొన్నింటిని మాత్రమే కూల్చివేసిన రెవెన్యూ యంత్రాంగం మిగతా వాటిపై దృష్టి సారించాల్సి ఉంది.

- నాగారం మున్సిపాలిటీ పరిధి సర్వే నంబర్ 297లో ఉన్న ఐదెకరాల ప్రభుత్వ, అసైన్డ్ భూములు అన్యాక్రాంతమవుతున్నాయి.
- శామీర్‌పేట్‌లో 45 ఎకరాల సొంత భూమికి పక్కన ఉన్న 10 ఎకరాల ప్రభుత్వ భూమిని కాజేసి వెంచరు చేశారు.
- పీర్జాదిగూడ నగరపాలక సంస్థలో సర్వే నంబర్.199 ప్రభుత్వ భూమిలో బహుళ అంతస్తుల భవనాలు వెలుస్తున్నాయి.


అక్రమ కట్టడాలు...

ఎంసీపల్లిలో 34 ఎకరాల్లో, లింగాపూర్ తండాలో రెండున్నర ఎకరాల్లో అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి. అంకుషాపూర్‌లో ఓ రియల్టర్ 2 కాల్వలకు చెందిన ఎకరం భూమిని ఆక్రమించి 30 ఎకరాల్లో వెంచర్ చేసి ప్లాట్లు విక్రయిస్తున్నా.. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు నోటీసులతోనే కాలం వెల్లదీశారు.

కొర్రెముల్ చైతన్యనగర్‌లో..

ఘట్‌కేసర్: కొర్రెముల్ చైతన్యనగర్‌లో అక్రమ కట్టడాలు చేపట్టారని ఎంపీఓ నందకిశోర్, కార్యదర్శి కవిత ఆధ్వర్యంలో బుధవారం కూల్చివేయించారు. డీపీఓ ఆదేశానుసారం కట్టడాన్ని కూల్చివేయించామని వారన్నారు. అనంతరం బాధితుడు వెంకటేశ్ నాయక్ మాట్లాడుతూ.. కొందరు పాలకవర్గ సభ్యులు డబ్బులు డిమాండ్ చేశారని, ఇవ్వనందుకు కార్యదర్శిపై ఒత్తిడి చేయించారని ఆరోపించారు. కూల్చివేతతో నాకు రూ.10 లక్షలు నష్టం వాటిల్లిందని, దీనికి కార్యదర్శి బాధ్యత వహించాలన్నారు.


బోడుప్పల్‌లో..


గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి సందర్భంగా బుధవారం మండలంలోని రాజబొల్లారం తండాలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేసిన గిరిజన, బీజేపీ నాయకులు.
– మేడ్చల్‌రూరల్